క్లుప్తంగా

ఆలయాభివృద్ధికి చేయూత


ఆలయం చుట్టూ ద్వారాలు, కిటికీలకు గ్లాస్ ఫిట్టింగ్ చేయించిన దృశ్యం

తనకల్లు: కనసానివారిపల్లి వద్ద వెలసిన ధనకొండ గంగమ్మ ఆలయ అభివృద్ధికి ప్రముఖ పారిశ్రామిక వేత్త, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎంజీ రెడ్డి చేయూతనిచ్చారు. దాదాపు రూ.2 లక్షల వ్యయంతో బుధవారం ఆలయం చుట్టూ ఉన్న ద్వారాలు, పెద్ద పెద్ద కిటికీలకు గ్లాస్ ఫిట్టింగ్ ఏర్పాటు చేయించారు. చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు ఇంటి దేవత కావడంతో ధనకొండ గంగమ్మ ఆలయానికి ప్రతి రోజూ భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి ప్రత్యేక పూజలు చేస్తుంటారు. కొందరు భక్తులు రాత్రి సమయాల్లో ఆలయంలోనే బస చేస్తుంటారు. అయితే అటవీ ప్రాంతంలో కావడం వల్ల చలి గాలులతో పాటు దోమలు ఎక్కువగా ఉండడంతో భక్తులు ఇబ్బందులు పడేవారు. దీంతో ఆలయాభివృద్ధి కమిటీ సభ్యులు సమస్యను ఎంజీ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన తన సొంత ఖర్చుతో గ్లాస్ ఫిట్టింగ్ చేయించారు.

ఈ- పంట నమోదు తప్పనిసరి


కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, రైతులు

నల్లమాడ: ప్రస్తుత సీజన్‌లో పంట సాగుచేసిన ప్రతి రైతూ ఈ -పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి అబ్దుల్ హక్ సూచించారు. మండలంలోని నల్లమాడ, పాతబత్తలపల్లిలో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ నానో యూరియా వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఉద్యాన సహాయకులు లోకేష్‌నాయక్, అస్లాం, రైతులు పాల్గొన్నారు.

జాబ్ మేళాకు స్పందన


జాబ్‌మేళాకు హాజరైన అభ్యర్థులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాకు మంచి స్పందన వచ్చిందని ప్రిన్సిపాల్ సురేష్‌బాబు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఎంప్లాయిమెంట్, సీడాప్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో 10 కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. 112 మంది ఇంటర్వ్యూలకు హాజరుకాగా.. 67 మందిని వివిధ కంపెనీల్లో జాబ్‌లకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌తోపాటు ఎస్‌పీఓసీ బాలజోషి, ప్లేస్‌మెంట్ అధికారి తేజ్‌కుమార్, ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సిబ్బంది, సీడాప్ సిబ్బంది, ఎంప్లాయ్‌మెంట్ అధికారులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

స్వామిత్ర సర్వే పరిశీలన

గాండ్లపెంట: మండల కేంద్రంలో జరుగుతున్న స్వామిత్ర సర్వేను డీఎల్‌పీఓ (డివిజనల్ పంచాయతీ అధికారి) వెంకటరత్నం బుధవారం పరిశీలించారు. ఈఓఆర్డీ సునీత మండల వ్యాప్తంగా 75 శాతం సర్వే పూర్తి చేసినట్లు తెలియజేశారు. శనివారంలోపు వందశాతం సర్వే చేయాలని పంచాయతీ కార్యదర్శులను డీఎల్‌పీఓ ఆదేశించారు. అనంతరం స్థానిక గ్రామ సచివాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. పంచాయతీ కార్యదర్శి మూర్తితో మాట్లాడి సచివాలయ సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు.

మానవ సేవే..మాధవ సేవ


అన్నం వడ్డిస్తున్న సీఐ సుబ్రహ్మణ్యం

ధర్మవరం రూరల్: మానవ సేవే మాధవ సేవ అని సీఐ సుబ్రహ్మణ్యం అన్నారు. బుధవారం ధర్మవరానికి చెందిన రజని ట్రస్టు, రక్త బంధం ట్రస్టు ఆధ్వర్యంలో కుమార్ పుట్టిన రోజు సందర్భంగా వారి కుటుంబ సభ్యుల సహకారంతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలోని రోగులకు అన్నదానం చేశారు. ముఖ్య అతిథులుగా సీఐ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదానం , రక్తదాన కార్యక్రమాలు నిర్వహించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో సమాజ సేవకులు కేతా లోకేష్, ట్రస్టు సభ్యులు కన్నా వెంకటేష్, జయప్రకాష్, జయ శంకర, సురేష్ కన్నా, వెంకటేష్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

మహిమాన్వితం.. బోగాదమ్మ క్షేత్రం

- ప్రతి ఆది, మంగళవారాల్లో ప్రత్యేక పూజలు
- ఆలయాన్ని అభివృద్ధి చేయాలంటున్న గ్రామస్తులు


అమ్మవారి మూలవిరాట్


సాదులవాండ్లపల్లి సమీపంలోని బోగాదమ్మ ఆలయం


ఆలయ పరిసర ప్రాంతంలో పచ్చదనం

గాండ్లపెంట: కటారుపల్లి పంచాయతీ సాదులవాండ్లపల్లి సమీపంలోని కనుమలో వెలసిన మహిమాన్విత క్షేత్రం 'బోగాదమ్మ' ఆలయం. గతంలో లోతట్టుగా చిన్న గుడి ఉండేది. అక్కడికి పోవడానికి భక్తులకు ఇబ్బందికరంగా ఉండడంతో గ్రామస్తుల చొరవ, దాతల సహకారంతో లోతట్టులో ఉన్న అమ్మవారి విగ్రహాన్ని ఎగువ ప్రాంతంలో ప్రతిష్టించి ఆలయ నిర్మాణం చేపట్టారు. ఆలయం చుట్టూ పరిసర ప్రాంతాలు పచ్చని కొండలు ఉండడంతో ఇక్కడికి వచ్చే భక్తులు బోగాదమ్మ తల్లిని దర్శించుకుని కొండల నడుమ ప్రశాంత వాతావరణంలో గడిపేందుకు వస్తారు. కనుమ ప్రాంతం.. కొండల నడుమ ఉండడంతో ఆలయాభివృద్ధి జరగలేదు. గ్రామస్తులే స్వచ్ఛందంగా ముందుకు వచ్చి దాతల సహకారంతో ఆలయాన్ని నిర్మించి అభివృద్ధి చేశారు. గత ప్రభుత్వ హయాంలో సాదులవాండ్లపల్లి నుంచి ఆలయం వరకు రోడ్డు వేయించారు. అదే విధంగా గాండ్లపెంట నుంచి వెళ్లడానికి సైతం మట్టిరోడ్డు ఉన్నా ఎక్కువగా ఎగుడుదిగుడుగా బండ్లరాళ్ల ఉండడంతో ఈ దారిగుండా వెళ్లాలంటే ఇబ్బందికరంగా వెళ్లాలి. ఆలయానికి ప్రతి ఆది, మంగళవారాల్లో భక్తులు అధికంగా వస్తుంటారు. అక్కడ సౌకర్యాల లేమి వల్ల ఉండడానికి సైతం అనుకూలం లేకపోవడంతో భక్తులు అమ్మవారిని సందర్శించుకుని వెళ్లిపోతుంటారు. ఏటా మే నెలలో మూడు రోజులపాటు అమ్మవారి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు.

కోర్కెలు తీర్చే తల్లి బోగాదమ్మ



భక్తుల కోరిన కోర్కెలు తీర్చే బోగాదమ్మ మహిమాన్వితురాలు. అమ్మవారిని దర్శించుకుని మొక్కుకుంటే కోర్కెలు తీరుతాయి. అనారోగ్యంతో ఉన్నవారు, సంతానం లేని దంపతులు, కుటుంబ సమస్యలు తీరాలంటే అమ్మవారిని దర్శించుకుని మొక్కుకుంటే చాలు నెరవేరతాయి. వారంలో ఆది, మంగళవారాల్లో భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది.

– రమణమ్మ, సాదులవాండ్లపల్లి

రోడ్డు సౌకర్యం కల్పించాలి



మారుమూలన కొండల నడుమ వెలసిన 'బోగాదమ్మ' అమ్మవారి ఆలయం అభివృద్ధి జరగాలంటే మండల కేంద్రం గాండ్లపెంట నుంచి పోతవాండ్లపల్లి మీదుగా, సాదులవాండ్లపల్లి నుంచి తలుపుల మండలం ఓబుళరెడ్డిపల్లి వరకు తారు రోడ్డు నిర్మించాలి. అదే విధంగా కల్యాణమండపం నిర్మిస్తే మండల పరిసర ప్రాంతాల ప్రజలకు శుభకార్యాలు నిర్వహించే వీలుంది. ప్రభుత్వం రోడ్డు సౌకర్యం కల్పిస్తే ఆలయ అభివృద్ధి జరుగుతుంది.

– చలపతి, సాదులవాండ్లపల్లి

రిజర్వు స్థలాల్లో మట్టి తవ్వేస్తున్నా పట్టించుకోరా?


ఇన్‌చార్జ్ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు, నాయకులు

ధర్మవరం అర్బన్: మున్సిపల్ రిజర్వు స్థలాల్లో అక్రమంగా మట్టిని తవ్వేస్తున్నా పట్టించుకోరా అని చైర్‌పర్సన్ కాచర్లలక్ష్మి, కౌన్సిలర్లు ప్రశ్నించారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఇన్‌చార్జ్ కమిషనర్ సాయికృష్ణకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని 27వవార్డు వైఎస్సార్ కాలనీ మున్సిపల్ పాఠశాల పక్కన ఉన్న మున్సిపల్ రిజర్వు స్థలంలో జేసీబీలతో ఇష్టారాజ్యంగా మట్టిని తవ్వేసి పెద్ద పెద్ద గుంతలు పెట్టారన్నారు. పట్టణంలోని మున్సిపల్ రిజర్వు స్థలాలు, ఖాళీ స్థలాల్లో అధికార పార్టీ అండ చూసుకుని కొంతమంది మట్టి తవ్వుతున్నారని తెలిపారు. ఆ గుంతల్లో నీరు చేరి ప్రమాదాలు సంభవించే అవకాశాలున్నాయని చెప్పారు. తవ్వకాలను ఆపకపోతే మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామని హెచ్చరించారు. రిజర్వు స్థలాలకు కంచె ఏర్పాటు చేసి.. కాపాడాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్లు జయరామిరెడ్డి, షేక్ శంషాద్‌బేగం, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు చందమూరి నారాయణరెడ్డి, మాసపల్లి సాయికుమార్, కడప రంగస్వామి, జిలాన్‌బాషా, యల్లయ్య, బ్రహ్మయ్య, నాయకులు చాంద్‌బాషా, పట్టణాధ్యక్షుడు కోటిరెడ్డి బాలిరెడ్డి, నాయకులు సుబహాన్, కత్తె పెద్దన్న, కేశవరెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్‌తో చాలా ప్రయోజనం

- పంటల నమోదుతో బహుళ ప్రయోజనాలు
- విపత్కాలంలో పరిహారం పొందే అవకాశం
- నెలాఖరుతో ముగుస్తున్న గడువు


రామాపురం వద్ద ఈ-క్రాప్ బుకింగ్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ స్వర్ణలత, ఏడీ ఓబిరెడ్డి

బత్తలపల్లి: ఆరుగాలం కష్టపడుతున్న అన్నదాతలకు అడుగడుగునా కష్టనష్టాలే మిగులుతున్నాయి. ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టాలను చూస్తున్న రైతులకు ఈ-క్రాప్ నమోదుతో కొంత వరకు ప్రయోజనం చేకూరుతుందని వ్యవసాయ శాఖ అధికారులు అంటున్నారు. విపత్తుల వేళ పరిహారం పొందేందుకు వీలుండడం ద్వారా కొంత ఉపశమనం కలుగుతుందని వారు చెబుతున్నారు. ధర్మవరం నియోజకవర్గంలో సాగు భూమి, విస్తీర్ణం, ఏ రైతు ఎంత సాగు చేస్తున్నాడు? ఏయే పంటలు పండిస్తున్నారు? అనే సమాచారాన్ని సేకరించి ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు. ఆయా పంటల వివరాలను గతంలో వ్యవసాయశాఖ అధికారులు సేకరించేవారు. ఇప్పుడు రెవెన్యూ, ఉద్యాన శాఖల అధికారులు ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను చేపట్టారు. గ్రామాల్లో సాగులో ఉన్న అన్ని రకాల పంటల వివరాలను నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో ఈ-క్రాప్ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఈ-క్రాప్ నమోదుకు సంబంధించి విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, ఎంపీఈఓలు వేగవంతంగా చేస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని ఏఓలు పర్యవేక్షిస్తున్నారు. ధర్మవరం మండలంలో 15,101 ఎకరాలు, బత్తలపల్లి 12,966 ఎకరాలు, తాడిమర్రి 6,200 ఎకరాలు, ముదిగుబ్బ 9,200 ఎకరాల్లో ఈ-క్రాప్ నమోదు పూర్తయింది. నెలాఖరు వరకు గడువు ఉంది. ఈ ప్రక్రియను సాధ్యమైనంత త్వరలో వందశాతం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని వ్యవసాయాధికారులు అంటున్నారు.

ఇవీ ప్రయోజనాలు..

ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పంట సాగు చేసిన రైతులకు ఈ-క్రాప్‌లో వివరాల మేరకు నేరుగా పరిహారం అందే వెసులుబాటు ఉంటుంది. దళారుల చేతికి బీమా పరిహారం అందదు. ఏ పంట ఎంత విస్తీర్ణంలో సాగైందో తెలుస్తుంది. అలాగే అవసరాన్ని బట్టి పంట మార్పిడికి వీలుంటుంది. పంటల వివరాల ఆధారంగా ఆహారోత్పత్తుల లభ్యతపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. పైగా దిగుబడుల అంచనాకు ఇది సరైన విధానం. ఎరువులు, పురుగు మందులు ఏ మేరకు అవసరమవుతాయో తెలిసే అవకాశం ఉంటుంది.

ఐలమ్మ స్ఫూర్తితో ముందుకెళ్లాలి


పుట్టపర్తిలో ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రజకులు

పుట్టపర్తి టౌన్: తెలంగాణ భూపోరాట ఉద్యమ నాయకురాలు చాకలి ఐలమ్మ స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని రజక నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం పుట్టపర్తిలో రజకసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాపనపల్లి శివప్ప ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ వర్ధంతి నిర్వహించారు. అలాగే సీపీఎం ఆధ్వర్యంలో పట్టణ కార్యాలయంలో ఐలమ్మ వర్ధంతి సందర్భంగా రజకులు ఐలమ్మ చిత్రపటానికి పూల మాల వేసి నివాళర్పించారు. అనంతరం ఆమె సేవలు కొనియాడారు. కార్యక్రమంలో చిన్నప్ప, పోతన్న, నాగమణి, గంగాధర్, చిరంజీవి, వీరచిన్నప్ప, రామ్య, సాయికుమార్ ఓబుళేసు పాల్గొన్నారు.

తలుపుల: రజక సంఘం ఆధ్వర్యంలో బుధవారం మండల పరిధిలోని ఎగువపేట, కుమ్మరిపేట పల్లికి చెందిన రజకులు చాకలి ఐలమ్మ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జీవి రమణ, తలుపుల నారాయణ, కుమ్మరిపేట రవి, ఆది, ఆంజనేయులు, ఓబులమ్మ, వాణి, అరుణ, రమేష్, బాబు, పులగంపల్లి బాబు, రమ తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్: తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ 40వ వర్ధంతిని కదిరిలోని చాకలి ఐలమ్మ దోబీఘాట్‌లో రజక సంఘం నాయకులు బుధవారం నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళర్పించారు. రజక సంఘం పట్టణ అధ్యక్షుడు నాగభూషణం, ఉద్యోగుల సంఘం బీసీ నాయకుడు చింతా నాగరాజు మాట్లాడుతూ ఐలమ్మ పేదల కోసం ఎన్నో భూ పోరాటాలు చేశారని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు రామ్‌కుమార్, శ్రీనివాసులు, నాగేంద్ర, వీరనారప్ప, శివప్ప, గంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

మిత్రుడిని కలిసేందుకు వచ్చిన ఎంపీ


ఎంపీ అప్పలనాయుడికి స్వాగతం పలికిన స్నేహితుడు సుబహాన్

గాండ్లపెంట: విజయనగరం ఎంపీ అప్పలనాయుడు మిత్రుడిని కలిసేందుకు బుధవారం గాండ్లపెంటకు వచ్చారు. కట్టుబడి సుబహాన్ శ్రీకాకుళం జిల్లా రణరంగ స్థలంలో పట్టుపరిశ్రమ శాఖలో పనిచేసి 2005లో రిటైరయ్యారు. అప్పట్లో ఈయన, ఎంపీ మంచి మిత్రులు. గత ఐదేళ్లుగా సుబహాన్ స్వస్థలం గాండ్లపెంటలో నివాసం ఉంటున్నారు. బుధవారం ఎంపీ దంపతులు గాండ్లపెంటకు వచ్చి మిత్రుడిని కలిసి యోగక్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం తిరిగి వెళ్లిపోయారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించండి


సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీడీఓ జనార్దన్‌రావు

ధర్మవరం రూరల్: సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నందున పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని డీడీఓ జనార్దన్‌రావు సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం రావులచెరువు సచివాలయాన్ని డిప్యూటీ ఎంపీడీఓ వెంకటేష్‌తో కలిసి తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ తాగునీరు, పారిశుధ్యం, వీధిలైట్లు తదితర మౌలిక వసతులను కల్పించడంలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించకూడదన్నారు. ప్రజల నుంచి వివిధ సమస్యలపై వచ్చే అర్జీలను పరిశీలించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి యల్లప్ప, వెల్ఫేర్ అసిస్టెంట్ అంకే శ్రీధర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ వంశీ, ఏఎన్‌ఎం శివలక్ష్మి, బృంద, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల యాజమాన్యం పాటించండి


దర్శనమల వద్ద రైతులతో కలిసి వరి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ

ధర్మవరం రూరల్: పంటలలో సమగ్ర ఎరువుల యాజమాన్యం పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏడీఏ లక్ష్మానాయక్ రైతులకు సూచించారు. బుధవారం మండల పరిధిలోని దర్శనమల, వెంకటతిమ్మాపురం గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంటలో ఎరువులను మూడు దఫాలుగా వేసుకోవాలన్నారు. పైపాటుగా కాంప్లెక్స్ ఎరువులు వాడరాదన్నారు. సాధారణ యూరియాకు బదులు ఎకరాకు 500 ఎంఎల్ నానో యూరియా పిచికారి చేయడం వల్ల రవాణా ఖర్చు ఆదా కావడంతో పాటు వినియోగ సామర్థ్యం ఎక్కువగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి ముస్తఫా, వీహెచ్‌ఏ నందిని, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

● భక్తిశ్రద్ధలతో సంకష్టహర చతుర్థి


వినాయకునికి ప్రత్యేక పూజలు చేసిన దృశ్యం

కదిరి టౌన్: పట్టణంలోని ఖాద్రీ దేవస్థానానికి అనుబంధ ఉమామహేశ్వరి(శివాలయం) ఆలయంలో బుధవారం రాత్రి అర్చకులు సంకష్టహర చతుర్థిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మొదటి గణపతిస్వామికి పంచామృత అభిషేక సేవా, గరిక పూజా ప్రత్యేకంగా మహిళలు ఉదయం నుంచి ఉపావాసాలు ఉండి సంకష్టహర చతుర్థి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.


హాజరైన మహిళలు

హుండీ కానుకల అపహరణ

కదిరి అర్బన్: మండలంలోని యర్రదొడ్డి గంగమ్మ ఆలయంలో మంగళవారం రాత్రి దుండగులు చొరబడి హుండీని ధ్వంసం చేసి భక్తుల కానుకలు అపహరించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ రామకృష్ణ బుధవారం అక్కడకు చేరుకుని పరిశీలించారు. క్లూస్‌టీంను రంగంలో దించి ఆధారాలు సేకరించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షునిగా గౌస్‌పీర్

కదిరి అర్బన్: మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి నూతన అధ్యక్షునిగా గౌస్‌పీర్‌ను సభ్యులు బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పాత కమిటీ అధ్యక్షుడు షర్ఫుద్దీన్ మృతిచెందడంతో నూతన అధ్యక్షుని ఎన్నిక అనివార్యమైందని సభ్యులు తెలిపారు.

వీధిలైట్ల నిర్వహణ అస్తవ్యస్తం

- నిత్య వెలుగులతో బిల్లుల మోత
- అంధకారంతో గ్రామీణుల హడల్
- విషపురుగుల బెడదతో బయటకు రాలేకపోతున్న జనం
- పట్టించుకోని గ్రామపంచాయతీ అధికారులు


నల్లచెరువులో పగలే వెలుగుతున్న వీధి లైటు


తహసీల్దార్ కార్యాలయం వద్ద వెలగని వీధిలైటు

నల్లచెరువు: గ్రామీణ ప్రాంతాల్లో వీధిలైట్ల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఓ వైపు ఎల్‌ఈడీ లైట్లు నిరంతరం వెలుగుతూనే ఉన్నాయి. మరోవైపు లైట్లు పనిచేయక చీకట్లు అలుముకుంటున్నాయి. విద్యుత్ ఆదా కోసం 2016లో మండలంలోని 13 పంచాయతీల్లో 2 వేలకు పైగా ఎల్‌ఈడీ లైట్లు ఏర్పాటు చేశారు. ఇందులో ప్రస్తుతం సగానికి పైగా లైట్లు నిరంతరం వెలుగుతూనే ఉంటున్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల పంచాయతీలకు విద్యుత్ బిల్లుల మోత మోగుతోంది. నిరంతరాయంగా వెలుగుతుండటం వల్ల లైట్ల జీవితకాలం కూడా తగ్గిపోతోందని సర్పంచులు వాపోతున్నారు.

వీధిలైట్లు వెలగక ఇబ్బందులు

మండలంలోని పలు గ్రామాల్లో వీధిలైట్లు పని చేయడం లేదు. మండల కేంద్రం నల్లచెరువులోని రైల్వే గేటు, బసవన్నకట్ట వీధుల్లో కొన్ని రోజులుగా వీధిలైట్లు వెలగకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం పడితే చీకట్లో విషపురుగులు సంచరిస్తున్నాయి. దీంతో ఎప్పుడు ఎక్కడ విషపురుగులబారిన పడతామోనని మహిళలు, చిన్న పిల్లలు బయటకు రావాలంటే భయపడుతున్నారు. దీనికి తోడు రాత్రి వేళల్లో దొంగతనాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ విషయమై ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేసినా.. స్థానికంగా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధిలైట్లు మరమ్మతులు చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మా దృష్టికి రాలేదు



వీధిలైట్ల సమస్య ఇప్పటి వరకు మా దృష్టికి రాలేదు. పంచాయతీ అధికారులు, కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేసి ఎల్‌ఈడీ లైట్ల నిర్వహణపై చర్చిస్తాం . సమస్య పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటాం.

– రఘునాథ గుప్తా, ఎంపీడీఓ